కథానిక

# పరికొత్త పాతకథ

ముద్దంశెట్టి హనుమంతరావు

శేఖర్ చచ్చిపోయాడన్న వార్త వూరంతా ప్రాకి పోయింది. కొన్ని హృదయాలు సానుభూతి చూపాయ్. యువకహృదయాలు పీడవదలి పోయిందని సంతోషించాయి. కాని తల్లిదండ్రులు ముఖ్యంగా మాతృహృదయం తల్లడిల్లిపోతూంది. ఆమె హృదయంలో తుపాను చెలరేగింది. స్వభావ సిద్ధమైన మరణం కాకుండా, నదిలో దుమికి ఆత్మ హత్య చేసుకోవటం మరింత తీరని ఆవేదన కలి గించిందామె హృదయంలో. మృతకళేబరమైనా కనుపిస్తే తనివితీరా కౌగలించుకోవాలనుకుంది. కాని ఆ అదృష్టంకూడా కలుగలేదు.

అందరికంటె యెక్కువగా ప్రేమహృదయం రజని వివర్ణవదనంతో నీరసించి పోయింది. ఆమె కన్నుల్లో కార్చేందుకు నీరుకూడా కరువై పోయింది. శేఖర్ యెందుకలా చేశాడో ఆమె కర్థం కాలేదు. ఆలోచించేందుకైనా మనసు స్థిమితంలో లేదు. శేఖర్ చనిపోయిం తరువాత యువకులంతా ఛాయల్లా తిరుగుతున్నారు. వారి గోల వారిది. కాని అందని మ్రానిపండని వారికి తెలియదు.

రోజులు దొర్లిపోతున్నయ్. శేఖర్ వియోగంవల్ల తలిదండ్రులు కృశించి పోతున్నారు. తండ్రిమనసు స్థిరంగాలేదు. ఏ క్రొత్తవ్యక్తి యింటికివచ్చినా "శేఖర్ కనిపించాడా?" అన్న ప్రశ్నే వేసేవాడు. వీరితోపాటు రజనికూడా ఒంటరి జీవితాన్ని గడుపుతూ పిచ్చిదానిలా తిరుగుతుంది. ఆమెను చూచినవారందరూ భయపడే వారు కూడా.

పోస్టుబంట్రోతు రజనియింటిముందాగి కేక వేశాడు. దగ్గర్లో కూర్చున్నా ఆమెకా ప్రసక్తే కలుగలేదు, నౌకరాడు ఉత్తరాన్నందుకుని రజని చేతిలో పెట్టాడు. ఆమె మామూలుగా తక్కిన వుత్తరాల్లా టేబిలుపై పడేసింది. కాని ఆదేమో మరి ఆమెదృష్టి మళ్ళీ ఆ కవరుపై పడింది. చిరు నామా దస్తూరీ ఆమెకు చిరపరిచితమైనట్టే తోచింది. ఆత్రంగా కవరు చించింది "ప్రియమైన రజనీ!" అని మొదలు పెట్టబడింది. తక్కిందంతా విడిచి చివరి సంతకం చూసింది. ఆమె ఆనందానికి అంతులేకండా పోయింది. ఆనందభాష్పాలు కళ్ళనుండి వుత్తరంపై పడ్డాయ్. ఆ సంతకం తన ప్రియుడు, ఆశ విడిచిపెట్టుకొన్న ప్రియుడు శేఖరానిదే. అందు కోలేని స్వర్గస్థానాన్ని పొందినంత ఆనందాన్ని పొందింది. మళ్ళీ మొదటకు వచ్చింది.

"ప్రియమైన రజనీ!

మీరంతా నాఆశ పూర్తిగా విడిచి పెట్టుకునే వుంటారనుకుంటాను. కాని భగవంతుడు పూర్తిగా నా ఆశయాన్ని నిర్వర్తించక నీ కోసమే నన్ను మళ్ళీ బ్రతికించినట్టుంది. అసలు కథ నీతో చెప్పటానికి వీలు చిక్కింది కాదు. అందుకే వ్రాస్తున్నా—

'మనవలపుల ఫలితంగా నేను మా నాన్నను కోరాను మనకి వివాహం నిశ్చయించమని, ఆయన ఆశ్చర్యంతో నవ్వి అదెన్నటికి కానేరదనే పట్టుతో కూర్చున్నాడు. కారణం అడిగాను. అన్నివిషయాల్లో సంబంధం బాగానే వుందట కాని మీ నాన్నకు, మా నాన్నకు గల పూర్వవైరం యిప్పుడు మన జీవితాలపై మారణ యంత్రమయింది. ఎంతో ప్రార్థించాను ప్రాధేయ పడ్డాను. చివరకు యెదురుతిరిగాను కాని లాభం లేకపోయింది. అప్పటికీ అతని రాతిమనసు కరుగ లేదు. అందుకే నీకూ చెప్పా, దాతో లేచి వచ్చే యమని, నువ్వయినా ధైర్యం వహించి ప్రేమను పోషించ లేకపోయావు. అవును నిన్ననేందుకు వీల్లేదు. నువ్వు కటకటాల మధ్యగతిలేక బ్రతుకుతున్నావు. మా అమ్మకూడా యెంతో ప్రయత్నించింది నాన్న మనసు మార్చాలని. ఫలితం సున్నా.

"నాకు వేరే గత్యంతరం అగుపించలేదు. అందుకే విరక్తికలిగింది, వెర్రివానిలా ఒకే నిశ్చయానికివచ్చా. అదే ఆత్మహత్య! ఆ నిశ్చయంతో నదిలో దూకాను. అక్కడున్న పశులకాపరులు యీ సంగతి వూరిలో చెప్పేవుంటారు. కొంత దూరంవరకు నీటిపై తేల్తూ, మునుగుతూపోయా అంతే! తరువాత నాకు స్పృహతప్పింది.

"అదృష్టమో, దురదృష్టమో తెలివి వచ్చేసరికి నాచుట్టూ జనం మూగివున్నారు.తరువాత అదొక పల్లెటూరని తెలుసుకున్నా. పక్షం దినాలవరకు ఆ పల్లెలోనే వున్నా.అక్కడినుంచిపట్టణంవచ్చేశాను. ఇప్పుడు పట్టణంలోనేవుంటున్నా. నా ఆరోగ్యం కుదుటపడింది. నిన్ను చూడాలని తహతహ పడుతున్నా గాని, నాన్నగారి ముఖం చూడ బుద్ధిపుట్టడంలేదు. ఏమైనా, ప్రయత్నిస్తాను. మా నాన్నగారికి సంగతి తెలియపర్చవద్దు. యిక్కడ వుద్యోగంకూడా చేస్తున్నా, జవాబుకై యెదురు చూస్తున్న—నీ శేఖర్."

శేఖర్ పేరు రెండుమూడుసార్లు చదువుకుని ఆ వుత్తరాన్ని హృదయానికి హత్తుకుంది. తనపై దయచూపిన భగవంతుని వేనోళ్ళ పొగిడింది మనస్సులో. యింతలో అడుగుచప్పుడువిని ఆ వుత్తరాన్ని మడతపెట్టి జాకెట్టు లోపల పెట్టుకుంది.

రజని తండ్రి, రామానుజం అప్పుడే వీధిలో నుండి యిల్లుచేరుకున్నాడు. కూతురు ముఖంలో కొత్త కాంతి కన్పించిందతనికి. దానికి యేదో కారణముండివుండాలనుకున్నాడు.

"ఏమిటమ్మాయ్! యివ్వాళ ఇంత ఆనందంగా వున్నావ్? మొదటలేని కొత్తకాంతి నీ ముఖంలో మూర్తీభవించింది. ఏదైనా సంతోషవార్త చెవిని బడిందా?"అన్నాడు కుర్చీలో కూలబడుతూ రామానుజం.

"ఏం లేదు నాన్నా! యెంత విచారించినా ఫలితంలేదుకదూ! పోయినవారు తిరిగొస్తారా? అందుకే గుండె నిబ్బరంచేసుకున్నా."

"వాడికోసమే, యింకాయేడుస్తున్నావుటే?" అని యింట్లోకిపోయాడు.

రజనికి వెన్నెముక విరిగినంత పనయింది. పరిస్థితులు ఎంత అనుకూలంగా వున్నా, విధి అంత ప్రతికూలంగా మారుతోంది. భారమంతా భగవంతునిపై విడిచి తన గదిలోకి పోయింది.

* * *

పట్టణంనుండివచ్చిన పెద్దమనిషి శేఖర్‌తండ్రి యింటికి వచ్చాడు. ఆ నూతనవ్యక్తిని చూట్టంతో శేఖర్‌తండ్రి ఆప్యాయంగా,

"ఏమోయ్‌రాజూ! మామీద యింతదయకలిగి వచ్చావ్-మరి వుత్తరాలు వ్రాయటమే మానేశావ్. మా దురవస్థలో మేం పడివుంటే వూరడించి ధైర్యంచెప్పేవారే లేరోయ్. పోనీలే—యింటిదగ్గరందరూ క్షేమంగా వున్నారుకదూ?" అన్నాడు.

"ఆ! క్షేమమే నోయ్. ఔనుగాని మొన్న యిరవైరోజుల క్రిందట శేఖర్ నదిలోపడి చచ్చిపోయినట్టు వ్రాశావు కదూ! హాస్యానికి వ్రాశావా? లేకపొరపాటా?"

"అదేమిటోయ్ రాజూ! ఈ విషయాలు హాస్యాలకు పొరపాటునకు దొరికిన పదాలా? చూస్తున్నావుగా నేనెలా మారిపోయానో! వాడి తల్లిమాటఅనుకవద్దు పూర్తిగా పిచ్చిదానిలా మారిపోయింది. చిన్నప్పట్నుంచి యెంతో గారాబంగా పెంచాం. యిప్పుడు చేతులారా విడిచిపెట్టుకుని మా ప్రాణాలమీదికి సహితం తెచ్చుకున్నాం." యీ మాటలకు రాజు నవ్వాడు. శేఖర్ తండ్రికి యీ నవ్వు వెటకారంగా కనుపించి కోపం కలిగించింది.

"అసలు సంగతేమిటివోయ్? ఎందుకు వాడలా చేశాడంటావ్?"అన్నాడు రాజు.

"ఎందుకేమిటి? యీకాలపు యువకులేంచేస్తున్నారు? అదే... రామానుజం తెలుసుకదూ! అతనికో కూతురుంది. అది మొన్నమొన్నటివరకు పట్టణంలో మేనత్త యింట్లో చదువుతుండేది. అక్కడే మావాడికీ, ఆ పిల్లకూ స్నేహంకుదిరి, అది ప్రేమగా మారి పక్వమయింది. దాన్ని తప్ప మరెవ్వర్ని వివాహం చేసుకోనని ఒకటే పట్టుపట్టాడు. నీకు తెలుసుగా నాకూ, రామానుజానికీ పరమ వైరమని. అలాంటివాడి కూతుర్ని కోడలుగా యెలా తెచ్చుకోవటం? అందుకే నేను అడ్డు చెప్పాను. వాడింతవరకు చేస్తాడని తెలుస్తే అప్పుడే వప్పుకొని వుండేవాణ్ణి"అంటూ కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు. రాజు మళ్ళీ నవ్వాడు.

"ఎందుకువోయ్ కంట తడి పెట్టుకుంటావ్?" యింకా పూర్తిచెయ్యకముందే.

"లేకపోతే నవ్వమంటావటోయ్ – నీకెలా తెలుస్తుంది? కన్నతండ్రి హృదయం!"

"ఓయ్ పిచ్చివాడా! శేఖర్ చనిపోలేదోయ్!"

"ఆఁ! ఆఁ! బ్రతికే వున్నాడా మా శేఖర్ రాజూ! ఎక్కడున్నాడూ?"

మేరలేని సంతోషంతో అతని చేతులుపట్టుకుని అడిగాడు శేఖర్ తండ్రి. యీ మాటలన్నీ వింటున్న శేఖర్ తల్లి ద్వారంవద్దకువచ్చి నిల్చుంది. రాజు మళ్ళీ మొదలుపెట్టాడు:

"మూడురోజులయి కనుపించాడోయ్, పట్టణంలో. మా యింటికి తీసుకుపోయాను. యిప్పుడు నా యింట్లోనే వుంటున్నాడు. వాడక్కడ వున్నట్టు నీతో సుతరామూ చెప్పొద్దనే చెప్పాడు. బ్రతిమలాడాడు. మొన్ననేదో వుత్తరంవ్రాయటం చూశాను. అది నీకేఅనుకున్నా, జరిగిన సంగతేమిటో చెప్పమని యెన్నిసార్లడిగినా చెబితేకదూ! అయినా కన్నకొడుకుతో కయ్యమెందుకు చెప్పు! చూస్తే ఒక్కకొడుకు. వాడి అభిప్రాయాలు తెలుసుకుని మెలగటం మంచిదికదూ!" అన్నాడు రాజు.

శేఖర్ తండ్రికి యీ మాటలన్నీ కలలో వింటూన్నట్టనిపించింది. ఎప్పుడో ఆశవదులుకున్న శేఖర్ వున్నాడంటే ఆనందంకదూ... బ్రతికుండి కూడా దూరంగా వుండటం శ్రేయస్కరమా? రాజుచెప్పినట్టు రజనితో వివాహంచేసేస్తే బావుంటుందనుకున్నాడు. కాని రామానుజానికీ తనకూ గల పూర్వపగ కళ్ళముందు నాట్యంచేసింది. తన కొడుకుకంటె యివన్నీ అంత ముఖ్యమయినవా?

"మరి రాజూ! వాణ్ణిక్కడికి తీసుకరాలేకపోయావూ? వాళ్ళమ్మ వాడికోసం శిథిలమైపోయింది."

"వస్తేకదూ! రమ్మన్నాను. మరి మీ ముఖం చూడనని నిస్సంశయంగా చెప్పేశాడు."

"యీ వివాహం యేర్పాటుచేయాలంటే మా పూర్వపుపగఅడ్డొస్తుంది. ఒకవేళమానాభిమానాలు విడిచిపెట్టి రామానుజందగ్గరకుపోయి విషయం చెబితే కూతుర్ని యిస్తాడన్న నమ్మకంయేదీ?".

"నేనూ నీతో వస్తాలేవోయ్. పరిస్థితులన్నీ నచ్చజెప్పుదాం. ఎంతకఠినహృదయుడైనా రెండు జీవితాలు నాశనమవుతూంటే చూస్తూ వూరుకుంటాడా!"

"ఔను! నువ్వుకూడా బయలుదేరు" అన్నాడు శేఖర్ తండ్రి.

ఆరోజు సాయంకాలం యిరువురూ కలిసి రామానుజం యింటికిపోయారు. తెల్లని వెన్నెల్లో రామానుజం యింటిముందు తోటయెంతో మనోహరంగా వుంది. రజని ద్వారంవద్ద లైటుపెట్టుపెట్టుకొనిచదువుకొంటూంది. రామానుజం ఇంట్లోలేనట్టే అనిపించిందా నిశ్శబ్దం చూచి శేఖర్ తండ్రికి.

"అమ్మాయ్ రజనీ!" మాటవినటంతో శేఖర్ తండ్రిని పోల్చింది. లేచి యెదురుగా వచ్చింది.

"నాన్నగారు లేరూ?" ఎన్నోసంవత్సరాల తరవాత మొదటిసారిగా వచ్చిన శేఖర్ తండ్రిలో మార్పుకి ఆశ్చర్యపోయింది.

"యిప్పుడే వస్తారండి - లోపలికివచ్చి కూర్చోండి" అంటూ లోపలికి పోయింది.

"అందుకేనోయ్-మీవాడంతగా పట్టుపట్టాడు. ఆ అందం, ఆ వయ్యారం, ఆ మర్యాద, ఆ అణకువ యెవ్వరికుంటాయి చెప్పు? ఇలాంటి అవకాశాన్ని జారవిడుచుకోవటం నీ తెలివితక్కువ" అన్నాడు రాజు, ఆమెకు విన్పించనట్టుగా మెల్లగా యిరువురుపోయి సావడిలో కూర్చున్నారు.

"ఏమమ్మాయ్-శేఖర్ యేమయ్యాడో నీకేమైనా తెలిసిందా?" అడిగాడు శేఖర్ తండ్రి. రజని సందిగ్ధంలో పడింది. శేఖర్ తన సంగతి తండ్రికి తెలియనియ్యొద్దని వ్రాశాడు. కాని కన్నతండ్రి హృదయం ఎంత తల్లడిల్లిపోతుందో! అన్న జాలి ఆమె హృదయంలో మెదిలింది. రహస్యం దాచలేకపోయింది.

"మొన్ననే వుత్తరం వచ్చిందండి. పట్నంలో వుద్యోగం చేస్తున్నారట. మీకు వుత్తరం వ్రాయలేదూ?" ఏమీ తెలీనట్టుగా అడిగింది.

"లేదమ్మా-యీయన చెప్పినంతవరకు వాడి విషయమే నాకు తెలీదు" అంటూ ఓ నిట్టూర్పు విడిచాడు, కన్నతండ్రిపై తక్కిన వారికంటె దూరమయ్యాను గదా అని, పాపం! రజని చిన్నబుచ్చుకుంది.

అప్పుడే రామానుజం వచ్చాడు. ఇంట్లో అడుగుపెడుతూంటే——

"ఏమోయ్ రామానుజం-చాలా సేపయి వచ్చి కూర్చున్నాం నీకోసం" అన్నాను శేఖర్ తండ్రి. ఎన్నో ఏండ్లనుండి సంబంధబాంధవ్యాలు లేకండా వుంటూవచ్చిన శేఖర్ తండ్రి తన యింట్లో కూర్చోవటం చూచి ఆశ్చర్యపోయి, ఏదో రహస్యము వుంటుందని అనుకున్నాడు.

"చాలాకాలం తరువాత ఇలా దయచేశావు" అనటాని కిష్టంలేకపోయినా వీల్లేక అన్నాడు.

"రామానుజం-మనం విరోధులమని తెలుసు. పౌరుషాలు యిరువురకు ఏం లోటులేకండా వున్నాయి. పట్టుదలకూడా వుంది. కాని నా పరిస్థితులు నన్ను లొంగదీశాయి. నా అభిమానాన్ని అణుచుకొని,అధిక్యతంటూలేకండా నీదగ్గర కొచ్చాను. నువ్వు నాకీ సహాయంమాత్రం చేసి రక్షించాలి" ఈ మాటలు అర్థం చేసుకోలేక తెల్లబోయాడు రామానుజం.

"అసలు సంగతేమిటో, చెప్పకండా..." అంటుండగా మళ్ళీ అందుకున్నాడు శేఖర్ తండ్రి.

"శేఖర్ కి రజిని నిచ్చి వివాహం చెయ్యాలి. యీ సమయంలో నువ్వు నిరాకరించావా, ఎన్నో జీవులు నాశనమైపోతాయి."

"శేఖరం చనిపోయాడుగా ఆత్మహత్య చేసుకుని!" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదోయ్-పట్టణంలో వుద్యోగం చేసుకుంటున్నాడు" అన్నాడు రాజు.

"అదెన్నటికీ కాదోయ్-విరోధులంగాఇప్పటివరకూ వుండి యిప్పుడు వియ్యకులం అయితే ప్రపంచం తూలనాడదూ? ప్రపంచపు మాట అటుంచు, నువ్వన్న మాటలు నా హృదయంలో లేవూ?" కఠినంగా అన్నాడు రామానుజం.

శేఖర్ తండ్రికి వెన్నెముక విరిగినట్టయింది. ఐతే తనూ పౌరుషం తెచ్చుకుని కార్యం నాశనం గావించుకుంటాడా! సహనంతో కార్యం సాధించాలనుకున్నాడు.

"రామానుజం—నువ్వాడిన మాటలు నాహృదయంలో మాత్రం లేవనుకుంటున్నావా? నా అవసరాన్ని బట్టి ఆత్మాభిమానాన్ని విడిచిపెట్టుకో వలసి వచ్చింది."

"ఏమైనా అను. యీ వివాహం మాత్రం జరగదు"నిశ్చయంగా చెప్పేశాడు. రాజు యిక వుపేక్షిస్తే లాభం లేదనుకున్నాడు.

"రామానుజంగారూ! మీకు నేను చెప్పవలసిన వాణ్ణి కాకపోయినా, నాబాధ్యత వున్నంతవరకు చెప్పదలచుకున్నాను. మీ ఇరువురిలో విరోధాగ్నిజ్వాలలు అంటిపెట్టుకొని వున్నయ్. మీలో వియ్యం కుదిరితేనేగాని, కయ్యం మరువరు. మీ మధ్య ఆ అమాయక యౌవ్వన జీవితాలు నలిగిపోతున్నయ్. మీ హృదయాల్లో యింకా ఎంత కాలం పగలు రగుల్చుకుంటారు? పగతో సాధించేదేమైనా వుందా? మానవులు జీవించే యీ కొద్ది కాలపరిమితిలో పగలూ, అసంతృప్తులెందుకు?" అంటూ చివరకు వేదాంతంలోకి దిగాడు రాజు.

రాజు మాటలు, రామానుజాన్ని కొంతవరకు చలింపజేశాయి. తీవ్రంగా తర్కించుకున్నాడు తనలో. రజనికూడా శేఖర్ వియోగంవల్ల చిక్కిపోతుంది. దినదినానికి దిగులుతో కృంగిపోతుంది. ఒకవేళ తను యీ పట్టుదల విడువకపోతే కొన్ని జీవుల దుర్మరణం తప్పదు. రాజుచెప్పినట్టు ఎందుకీపగలు? తన అభిమానానికిప్పుడేం లోటు రాలేదుగా! అతడే ముందొచ్చి మాట్లాడాడు. అదీగాక పిల్లకు కూడా యీడొచ్చింది. వివాహం చెయ్యాలి. ఒక్క విరోధమన్న మాట తప్పితే యింతకంటె మంచి సంబంధం ఎక్కడ దొరుకుతుంది? చివరకు నిర్ణయానికొచ్చాడు.

"సరేలేవోయ్-ఒప్పుకోపోతే యేఅవకతవకలు తటస్థించినా నన్నే బాధ్యుడిగా చేస్తుందీ ప్రపంచం-ముహూర్తం నిర్ణయించు" అన్నాడు రామానుజం.

శేఖర్ తండ్రి ఆనందంతో రామానుజం చేతులు పట్టుకొని, "రక్షించావోయ్..." అనగలిగాడు నవ్వుతూ, రాజు వారిలో నవ్వుకలిపాడు. ఇదంతా ఆత్రంగావింటున్న రజని ఒక్కదాటున యింట్లోకిపోయి మెల్లగా యేదో పాట పాడుతోంది...